ప్రతిభ చూపి.. కొలువు దీరి..

- క్యాంపస్ ఇంటర్వ్యూల్లో జీఎంఆర్ విద్యార్థుల సత్తా
- 27 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న 27 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో రాణించి వివిధ కంపెనీలలో మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు చొరవతో డిపార్ట్‌మెంట్ హెడ్‌లు, లెక్చరర్లు మెకానికల్, ఈఈఈ, సీఎంఈ కోర్సులను ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా రూపకల్పన చేశారు. మానసిక ఒత్తిడిలేని విద్యాబోధన, మెరుగైన నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ అందిస్తున్నారు. అంతే కాకుండా ఇండస్ట్రియల్ ట్రెనింగ్‌కు వెళ్లే సమయంలో మరిన్ని మెళుకువలు నేర్పుతున్నారు. తద్వారా విద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ఇటీవల కాకినాడలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 27 మంది వివిధ కంపెనీలలో మంచి జీతం ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు సాధించారు. ఆ విద్యార్థులకు మంగళవారం రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్‌విప్ మార్గాని భరత్‌రామ్ చేతులమీదుగా జాబ్‌లెటర్స్‌ను అందించారు.


ఉద్యోగాలు సాధించిన జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

సంతోషం



సీఎంఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న నేను క్యాంపస్ ఇంటర్వ్యూలో తిరుపతి ఫిక్సల్ గ్రాఫిక్‌లో ఏడాదికి రూ.1.80 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించాను. లెక్చరర్ల సూచనలు, సలహాలతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదవడం ఎంతగానో ఉపయోగపడింది. చదువు పూర్తవుతున్న సమయంలోనే ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.

– కర్రి రామగణేష్, విద్యార్థి

ఆనందంగా ఉంది



ఈఈఈ ఫైనల్ ఇయర్ చదువుతుండగానే క్యాంపస్ ఇంటర్వ్యూలో చెన్నై వీల్స్ ఇండియా కంపెనీలో ఏడాదికి రూ.3.3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించాను. లెక్చరర్ల సూచనలు, సలహాలు బాగా ఉపయోగపడ్డాయి. ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉంది.

– బళ్లా చందు, విద్యార్థి

ఎంతో ఉపయోగం



మెకానికల్ ఫైనల్ ఇయర్ చదువుతున్న నాకు తిరుపతిలోని శ్రీరాఘవేంద్ర టెక్నాలజీస్‌లో ఏడాదికి రూ.1.80 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. పాలిటెక్నిక్ కోర్సులలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయి.

– వడ్డి అఖిలాష్‌రెడ్డి బొమ్మూరు

క్లుప్తంగా

వసతి గృహాల తనిఖీ

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి నగరంలోని పలు సంక్షేమ వసతి గృహాలను మంగళవారం తనిఖీ చేశారు. ప్రకాశం నగర్‌లోని కేవీ స్టేట్ హోంను తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. అనంతరం బాలసదనాన్ని సందర్శించారు. ఉద్యోగినుల వసతి గృహాన్ని, బాలుర పర్యవేక్షణ గృహాలను పరిశీలించారు. ఎలాంటి న్యాయ సేవలు కావాలన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థకి తెలియజేయాలన్నారు.

ఐసీయూలో లబ్ధిదారుకు పింఛన్ పంపిణీ


కోటమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రామలక్ష్మి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక 27వ డివిజన్ ఇన్నీసుపేటకు చెందిన 38వ వార్డు సచివాలయం పరిధిలో పోలవరపు కోటమ్మ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ బొజ్జ రామలక్ష్మి ఆస్పత్రికి వెళ్లి కోటమ్మకు వితంతు పింఛన్ అందించింది.

7 నుంచి బాస్కెట్ బాల్ శిక్షణ

ప్రకాశం నగర్: సిటీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి ఎస్‌కేవీటీ కళాశాల బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లో ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరం ప్రారంభోత్సవానికి వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల యూత్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

తడిసిన ధాన్యం పరిశీలన

కడియం: తడిసిన ధాన్యానికి కూడా పూర్తి మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం కడియం ఆవ, దుళ్ల గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మంగళవారం దుళ్లలోని డాక్ట్ ఎస్.జీవరత్నం ప్రార్థనా మందిరంలో మంగళవారం జరిగింది. ఫెలోషిప్ నాయకులు ఎం.కరుణాకర్, డి.పరంజ్యోతి, ప్రసన్నకుమార్, కె.జయశీల్ వేదికను అలంకరించి సందేశాలనందించారు. ముఖ్య అతిథులుగా అరుణ్‌పాల్, జాన్ వెస్లీ విచ్చేసి వాక్యసందేశాన్నిచ్చారు. రాకడ రావు ముగింపు ప్రార్థనతో కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు

కడియం: మండల పరిధిలోని ధాన్యం కొనుగోళ్లను ఆఫ్‌లైన్‌లో చేపట్టినట్లు తహసీల్దార్ ఎం.సుజాత మంగళవారం తెలిపారు. మండలంలోని రెండు రైసుమిల్లులతో పాటు, పెదపర్తిలోని రైసు మిల్లులకు ఆఫ్‌లైన్‌లో సేకరించిన ధాన్యం రవాణా చేయడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నూకశాతం కొలిచే యంత్రాన్ని కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. 30 శాతంలోపు నూక ఉన్నప్పటికీ మద్దతు ధర తగ్గించడం జరగదన్నారు.

చిట్టూరి ఆశయాలను నెరవేర్చాలి

ప్రకాశం నగర్: మాజీ ఎమ్మెల్యే, స్వాతంత్ర్య సమరయోధుడు చిట్టూరి ప్రభాకర్ చౌదరి ఆశయాల సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షతన ప్రభాకర చౌదరి వర్ధంతి సభ నిర్వహించారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ


తొర్రేడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం తొర్రేడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు, పాఠశాల విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి.. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే ఇబ్బందులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ నెలలో తొర్రేడులో జరిగే ఓనువులమ్మ జాతరలో అందరూ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి ఆరోగ్యవంతమైన జీవనానికి బీటలు వేయాలని కోరారు. కాతేరుకు చెందిన గారపాటి వనజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో లజపతిరాయ్

కడియం: వేమగిరితోట –2 ఎంపీపీ స్కూలు వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో వి.లజపతిరాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాస్, వాసంశెట్టి నానిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ సురేష్, హెచ్‌ఎం ఇంద్ర పాల్గొన్నారు.

యూటీఎఫ్ నిర్మాత రామిరెడ్డి వర్ధంతి

కంబాలచెరువు: యూటీఎఫ్ నిర్మాత, ఎస్‌టీఎఫ్ఐ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దాచూరి రామిరెడ్డి వర్ధంతిని యూటీఎఫ్ హోమ్‌లో మంగళవారం ఆ సంఘ అధ్యక్షుడు పి.జయకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ పోరాట పటిమకు దాచూరి రామిరెడ్డి మారుపేరన్నారు. ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, ఉపాధ్యక్షురాలు విజయ్‌గౌరి, కార్యదర్శులు శ్రీమణి సుబ్బారావు, రమేష్ బాబు, రవిబాబు, ప్రకాశరావు, ఫణికుమార్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దివ్యకల్యాణ మహోత్సవం

సీటీఆర్ఐ: నగర క్షేత్ర పాలకుడిగా పూజలందుకుంటున్న రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారి వార్షిక దివ్యకల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ తన మాతృమూర్తి ప్రసూనతో కలిసి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ, ఆలయ అర్చకుడు ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేణుగోపాలస్వామికి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎంపీ భరత్ రామ్ సమర్పించారు. వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ భరత్ రామ్, ఆయన మాతృమూర్తి ప్రసూనను ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో దుర్వాసుల సత్యనారాయణ, కొత్త బాలమురళి తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎంపీ భరత్‌రామ్

ఎస్‌కేఆర్ మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు తీర్మానం

సీటీఆర్ఐ: సంఘసంస్కర్త, సాహితీవేత్త కందుకూరి వీరేశలింగం స్థాపించిన విద్యాసంస్థలన్నిటిని కలిపి శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని హితకారిణీ సమాజం చైర్మన్ కాశి బాల మునికుమారి అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో తీర్మానం చేశారు. మంగళవారం హితకారిణి సమాజం చైర్మన్, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముని కుమారి మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం, ఆయన భార్య కందుకూరి రాజ్యలక్ష్మి వారి యావదాస్తిని సమాజ హితం కోసం, మహిళా అభ్యున్నతి కోసం త్యాగం చేశారన్నారు. హితకారిణి సమాజం ద్వారా విద్యాసంస్థలను స్థాపించి, స్త్రీవిద్య కోసం ప్రత్యేకంగా కృషి చేశారన్నారు. కాలనుగుణంగా హితకారిణి సమాజం పాలకమండలి ఆయన స్థాపించిన విద్యాసంస్థలను నిర్వహించలేని పక్షంలో, వాటన్నింటినీ ప్రభుత్వంలో విలీనం చేసి అభివృద్ధి చేయాలని ముందు చూపుతో ఆయన స్వయంగా వీలునామా రాయించారన్నారు. ఈ క్రమంలోనే ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీ, శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో విలీనం చేశారన్నారు. ప్రస్తుతం హితకారిణి సమాజం పరిధిలో మిగిలిన శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ఎంబీఏ, డీఈడీ మహిళా కళాశాలలను కూడా కలుపుకొని శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా విశ్వవిద్యాలయంగా మార్చాలని తీర్మానం చేసి ముఖ్యమంత్రికి పంపనట్లు తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యుడు మార్గాని భరత్ రామ్ తో చర్చించామన్నారు.


సమావేశంలో పాల్గొన్న మునికుమారి తదితరులు

75 ఎకరాల స్వాధీనం

సీటీఆర్ఐ: ఎల్‌ఆర్టీ ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని సీతానగరం, కోరుకొండ మండలం మధురపూడి, మునగాల, మిర్తిపాడులో 75.36 ఎకరాలను మే ఒకటో తేదీన సంబంధిత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల ద్వారా స్వాధీనం చేసుకున్నట్లు రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ అధికారి ఏ.చైత్రవర్షిణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. సీతానగరం మండలం మిర్తిపాడుకు చెందిన మద్దిపాటి రాజాచౌదరికి చెందిన మధురపూడిలోని 19 ఎకరాల 72.1/2 సెంట్లు, మునగాలలో 10 ఎకరాల 12 సెంట్లు, మిర్తిపాడు 12 ఎకరాల 74 సెంట్లు, సీతానగరం మండలం మిర్తిపాడుకు చెందిన మద్దిపాటి జోగేంద్రనాథ్ చౌదరికి చెందిన మధురపూడిలో 19 ఎకరాల 72. 1/2 సెంట్లు, మునగాలలో 7 ఎకరాల 98 సెంట్లు, మిర్తిపాడు 5 ఎకరాల 07 సెంట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు: న్యాయస్థానాల్లో కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించేందుకు ఆసక్తి కలవారి నుంచి మీడియేటర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి మీడియేషన్ అండ్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈనెల నాలుగో తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విశ్రాంత న్యాయమూర్తులు, ఏడేళ్ల అనుభవం ఉన్న న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, వివిధ వృత్తుల్లో 15 ఏళ్ల అనుభవం కలిగిన నిపుణులు అర్హులన్నారు.

మర్యాదపూర్వకంగా..


కలెక్టర్ మాధవీలతకు మొక్క అందజేస్తున్న మైన్స్ ఏడీ సుబ్రహ్మణ్యం

సీటీఆర్ఐ: జిల్లా మైన్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా నూతనంగా విధుల్లో చేరిన ఎం.సుబ్రహ్మణ్యం మంగళవారం కలెక్టర్ మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన గతంలో నందిగామ, విజయవాడ, ఏలూరు పట్టణాల్లో పని చేశారు. ఏలూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ శాఖాపరంగా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో నిబద్ధత చూపాలన్నారు. ఇసుక పాలసీ విధానం అమలులో ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఆయనకు పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.

సంక్షేమ పథకాలతో వెలుగులు

- ఎంపీ మార్గాని భరత్ రామ్
- నగరంలో పర్యటన

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మంగళవారం 42వ డివిజన్ ఇన్‌చార్జి నామన వాసు ఆధ్వర్యంలో లలితా నగర్‌లో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలో సిల్ట్ పేరుకుపోయి మురుగు నిలిచిపోవడాన్ని గుర్తించి.. తక్షణమే చర్యలు చేపట్టాలని శానిటరీ విభాగం అధికారులకు ఆదేశాలిచ్చారు. ఓ వృద్ధురాలికి ప్రభుత్వ పెన్షన్ మంజూరయ్యే వరకూ.. ప్రత్యేకంగా రూ.1500 అందేలా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. వేలిముద్రలు పడక తమకు రేషన్ బియ్యం అందడం లేదని ఒకరిద్దరు ఎంపీ దృష్టికి తీసుకురావడంతో వెంటనే అక్కడికక్కడే రేషన్ ఇప్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్ పాల్గొన్నారు.

లక్ష్యసాధన దిశగా అడుగులు

రాజమహేంద్రవరం రూరల్: యువత దేశానికి వెన్నెముక వంటి వారని, సమాజాభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. బొమ్మూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్ అఛీవర్స్‌డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మన మనసులో కేవలం లక్ష్య సాధన ఒకటే ఉండాలని, ఆ దిశగా అడుగులు వేసి అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, హెచ్‌ఓడీలు పి.జగన్మోహన్‌రావు, డి.శ్రీనివాస్, ఏ.నాగార్జున, ఎంపీ మురళీకృష్ణ, ప్లేస్మెంట్ ఆఫీసర్ జి.మేరీమణి పాల్గొన్నారు.


నగరంలోని మురుగుకాలువను పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

అభివృద్ధి విషయంలో రాజీ పడకండి

వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వార్డు ఇన్‌చార్జులు, కన్వీనర్లు, పార్టీ శ్రేణులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ ఉండాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో నగరంలోని 1, 4 వార్డులకు చెందిన ఇన్‌చార్జులు ముప్పన ప్రభాకరరావు, బొంతా శ్రీహరి, నాయకులు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆయా వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఎంపీ తెలుసుకున్నారు. సమావేశంలో నక్కా నగేష్, ఎన్వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరశురామ జయంతి

సీటీఆర్ఐ: గోదావరి గట్టున గల భార్గవ కల్యాణ మండపంలో మంగళవారం పరశురామ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పరశురాముని విగ్రహానికి ఎంపీ భరత్‌రామ్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసు, చెరుకూరి నాగసాయి, మల్లాది ఉదయరాజా పాల్గొన్నారు.

డైట్ విద్యార్థినులకు బహుమతులు


సంతోషి


శ్రీలక్ష్మీప్రియ

రాజమహేంద్రవరం రూరల్: సమాజంలో కుటుంబ విలువలు, సంబంధాలు పెంచే ఉద్దేశంతో రాజమండ్రి పోస్టల్ డివిజన్ ఇటీవల నిర్వహించిన తాతకు, నానమ్మకు, అమ్మమ్మకు లేఖ పోటీలలో కేటగిరి బి విభాగంలో బొమ్మూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) విద్యార్థినులు తమ ప్రతిభ చాటారు.

డీఎల్ఈడీ రెండో సంవత్సరం విద్యార్థిని సీహెచ్ సంతోషి ద్వితీయ బహుమతిగా రూ.1000, సర్టిఫికెట్, అలాగే ప్రథమ సంవత్సర విద్యార్థిని ఆర్ఎస్‌కే శ్రీలక్ష్మీప్రియ కన్సోలేషన్ బహుమతిగా రూ.250, సర్టిఫికెట్‌ను పొందారు. ప్రిన్సిపాల్ నూజిళ్ల రామసుబ్రహ్మణ్యం, సీనియర్ అధ్యాపకులు కేవీ సూర్యనారాయణ తదితరులు ఆ విద్యార్థినులను అభినందించారు.

వరిపంటను కాపాడుకుందామిలా..

రాజమహేంద్రవరం రూరల్: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు పనల మీద, కళ్లాల్లో ఉన్న వరిపంట దెబ్బతింటే రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. నష్ట నివారణకు చేపట్టాల్సిన చర్యలను జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఎం.నంద కిషోర్ వివరించారు. గింజ గట్టిపడే దశ నుంచి కోతదశలో చేను పడిపోకుండా ఉండి, నిద్రావస్థ కలిగిన రకాలలో నష్టం తక్కువగా ఉంటుందన్నారు. నిద్రావస్థ లేనటువంటి రకాలు నీట మునిగితే కంకిపైనే గింజ మొలక వచ్చి నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు.


నందకిషోర్, జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్

- మనుషులతో కోత కోసిన పనలు వర్షానికి తడిస్తే, గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని (లీటరు నీటికి 50 గ్రా ఉప్పు) పనలపై పడేలా పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి. పొలంలో నీరు లేకపోయినట్లయితే మడిలోనే పనలపై ఉప్పు నీరు చల్లుకోవచ్చు. ఒకవేళ పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి.
- కుప్పవేసే సమయంలో తుపాను వాతావరణం వల్ల పనలు తడిస్తే, కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పవేసుకోవాలి.
- నూర్చిన ధాన్యాన్ని 2, 3 రోజులు ఎండబెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఒక క్వింటాల్ ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తి చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పార బట్టి నిలవ చేసుకోవాలి.
- పూర్తిగా తడిచి రంగు మారిపోయిన ధాన్యానికి మార్కెట్ పూర్తిగా తగ్గిపోతుంది కనుక, ఇటువంటి ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చు.

కక్షసాధింపు కోసమే కేసులు

సీటీఆర్ఐ: జగన్ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, అన్యాయాలను ఎదిరించి ప్రశ్నిస్తున్న వారిపై కక్ష సాధించి అక్రమ కేసులు పెడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు గోపాల రాయుడు, కార్యదర్శి కాశి నవీన్ కుమార్ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసులపై కక్ష పెట్టుకుని అన్యాయంగా కేసులు పెట్టారన్నారు. ఆదిరెడ్డి కుటుంబం నడుపుతున్న జగజ్జనని చిట్స్ ప్రైవేటు లిమిటెడ్ 38 ఏళ్ల ప్రస్థానంలో డిపాజిట్‌దారులు, చిట్టీలు వేసిన వారి నుంచి గానీ ఒక్క ఫిర్యాదు లేదన్నారు.

ఎమ్మెల్యే భవానికి పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానిని తిలక్ రోడ్డులోని వారి ఇంటి వద్ద ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, వెంకట శివరామరాజు, మాజీ ఎంపీ తోట సీతామహాలక్ష్మి, తణుకు మాజీ ఎమ్మెల్యే అరుమిల్లి రాధాకృష్ణ, మాజీ మంత్రి జవహర్ పరామర్శించారు.

సెంట్రల్ జైలులో ములాకత్

కంబాలచెరువు: చిట్‌ఫండ్ కంపెనీ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, రామరాజు, మాజీ ఎమ్మెల్యేలు ఆరుమిల్లి రాధాకృష్ణ, డాక్టర్ చలుమూరి తులసి మోహనరావు ములాకత్‌లో భాగంగా కలిసి మాట్లాడారు. అనంతరం మాజీ మంత్రి జవహర్, మాజీ ఎంపీ తోట సీతామహాలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గన్ని ఆంజనేయులు, ఆకుల రామకృష్ణ తదితరులు సెంట్రల్ జైలు వద్దకు చేరుకుని ఆదిరెడ్డి కుటుంబానికి సంఘీభావం తెలిపారు.


సిటీ ఎమ్మెల్యే భవానీని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు